ప్రజాశక్తి
సోమవారం 24 ఫిబ్రవరి 2025
5
పార్వతీపురం మన్యం

నేడు పార్వతీపురంలో చికెన్, ఎగ్ మేళా

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత చికెన్, ఎగ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ శివ్వాల మన్మధరావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం సాయంత్రం 5 గంటల నుండి 7 గంటల వరకు పార్వతీపురంలో భాస్కర డిగ్రీ కళాశాల సమీపాన (పెట్రోల్ బంకు)లోను, కొత్తవలస అమ్మవారి గుడి సమీపంలో ఈ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో ప్రాంతంలో 200 కేజీల చికెన్ వంటకాలను, 2వేల వుడికించిన గుడ్లను ఉచితంగా పంపిణీ చేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

కోరెడ్ల విజయగౌరి.. పోరాటాల్లో శివంగి

ఉపాధ్యాయ ఉద్యమాల్లో గర్జించే శివంగి... మహిళా ఉద్యోగుల పెన్నిధి... సమస్యల పట్ల స్పష్టమైన అవగాహన కలిగిన మేధావి... పాలకపార్టీల కుతంత్రాలను నిర్భయంగా నిలదీసే నేత... బాలికల్లో అక్షరాస్యత పెంపొందించేందుకు పల్లెబాట పట్టిన వనిత. ఆమె ఎవరో కాదు. ఉత్తరాంధ్రా ఉపాధ్యాయ లోకానికి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేని కోరెడ్ల విజయగౌరి. ఉపాధ్యాయ ఉద్యమంలో టక్కున గుర్తుకు వచ్చేది ఈమె పేరే. బహుసా అందుకేనేమో శాసనమండలిలో రాజకీయాలతో సంబంధం లేకుండా ప్రభుత్వాలని నిక్కచ్చిగా నిలదీసే పిడిఎఫ్ (ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్) తరపున ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించింది. ఈ నేపథ్యంలో ఆమె పోరాట పటిమ ఒకసారి పరిశీలిస్తే.., నిర్బంధాలు, కేసుల నడుమ ఆమె సాహస పోరాటాలు, విజయాలు ప్రస్ఫుటిస్తాయి.

- ఉపాధ్యాయ నేతగా ఎన్నో సమస్యలకు పరిష్కారం
- అక్రమ కేసులు, నిర్బంధాలు లెక్కచేయని వైనం
- మండలి బరిలోనూ అదే దూకుడు
- నిక్కచ్చిగా నిలదీసే పిడిఎఫ్ తరపున పోటీ

ఐటిడిఎ వద్ద దీక్షా శిబిరంలో నిద్రిస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి (ఫైల్)

ఐటిడిఎ వద్ద రాత్రిపూట వంటావార్పు కార్యక్రమంలో పాల్గొన్న పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరి

ప్రజాశక్తి - పార్వతీపురం

సుమారు 33 ఏళ్ల క్రితం కోరెడ్ల విజయగౌరి ఉపాధ్యాయురాలిగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. నాటి నుంచి నేటి వరకు ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల కోసం పనిచేయడమే ఆమె చరిత్ర. ఆమె చేపట్టిన పోరాటాలు, విజయాలు, నిర్బంధాలు, అక్రమ కేసులు ఒకసారి పరిశీలిస్తే...

☞ రేషనలైజేషన్ పేరిట పాఠశాలల కుదింపు, క్లస్టర్ పాఠశాలల విధానం వంటి వాటిపై ఉద్యమాలు ముందుకు నడిపేందుకు విజయగౌరి చొరవ చూపారు. ఆ మేరకు ఉత్తరాంధ్ర జిల్లాలు, ముఖ్యంగా ఏజెన్సీల్లో పాఠశాలల మూసివేత తగ్గింది. పోరాటాల ఫలితంగా కొన్ని పాఠశాలల పునరుద్ధరణ కూడా జరిగాయి.

☞ జిఒ నెంబర్ 72కి వ్యతిరేకంగా చేపట్టిన పోరాటంలో పోలీసులు అక్రమ కేసు బనాయించినా వెరవలేదు. పేదలను విద్య నుంచి దూరం చేసే నూతన విద్యావిధానంపై జరిగిన పోరాటంలోనూ ఎంతో చురుకుగా పనిచేసి తనదైన ముద్ర వేశారు. ఈ క్రమంలో ప్రభుత్వ నిర్బంధాలు, బెదిరింపులు, కేసులు ఎదుర్కొన్నారు.

☞ గిరిజన ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నడిపిన ఉద్యమంలో ముఖ్య భూమిక పోషించారు. ముఖ్యంగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న సిఆర్‌టిల రెన్యువల్, రెగ్యులరైజేషన్ వంటి వాటి కోసం విజయగౌరి పోరాటం.. ఉపాధ్యాయ ఉద్యమంలో మరిచి పోలేనిది.

☞ గిరిజన సంక్షేమ పాఠశాలల ప్రధానో పాధ్యాయుల అధికారాల తొలగింపునకు సంబంధించిన జిఒ 132 రద్దు కోసం అవిశ్రాంత పోరాటం చేశారు. ఐటిడిఎ కార్యాలయం ఎదుట నిర్వహించిన దీక్ష శిబిరంలో రాత్రి బస చేశారు. చివరకు ప్రభుత్వం దిగొచ్చి ఆ జిఒను రద్దు చేసింది.

☞ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్, రెగ్యులరైజేషన్ కోసం జరిగిన ఉద్యమంలో తన వంతు పాత్ర పోషించారు.

☞ 2017లో అక్రమ బదిలీలపై జరిగిన ఉపాధ్యాయుల ఆందోళన కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయ నేతగా నాయకత్వం వహించారు. అప్పట్లో పెట్టిన అక్రమ కేసు ఏడేళ్లపాటు నడిచింది.

☞ 2017లోనే ఉపాధ్యాయుల వెబ్ కౌన్సెలింగ్ రద్దు చేయాలని యుటిఎఫ్ తనదైన శైలిలో పోరాటం నడిపింది. చివరికి నాటి వెబ్ కౌన్సెలింగ్ రద్దు చేసి మాన్యువల్ కౌన్సిలింగ్‌ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ పోరాటంలో కీలకపాత్ర పోషించిన విజయగౌరిపై అప్పటి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించింది. ఆ కేసును ఎదుర్కోవడానికి ఆమె కోర్టు చుట్టూ ఏడేళ్లపాటు తిరిగారు. అయినా సరే, విజయగౌరి వెరవలేదు. మరింత మొక్కవోని దీక్షతో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయుల్లో ఎక్కువమంది ఆమె అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ స్వచ్ఛందంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. విజయానికి సానుకూల అవకాశాలు కూడా కనిపిస్తున్నాయి.

వైఎస్ఆర్ స్పందించేలా

2005లో 300 మంది ఉపాధ్యాయుల అక్రమ బదిలీల నిలుపుదల కోసం విజయగౌరి పోరాడారు. ఆ క్రమంలో అప్పటి సిఎం వైఎస్ రాజశేఖరరెడ్డి.. నేడు మన్యం జిల్లాలో భాగంగా ఉన్న జంఝావతి ప్రాజెక్టు రబ్బర్ డ్యామ్ ప్రారంభానికి వచ్చినప్పుడు పోలీసుల వలయం నుంచి తప్పించుకుని మరీ సభాస్థలి వద్దకు చేరుకుని ప్లకార్డుతో పెద్దపెట్టున నినాదాలు చేయడంతో అధికార యంత్రాంగం అవాక్కైంది. ఉలిక్కిపడ్డ అప్పటి మంత్రి బొత్స సత్యనారాయణ బయటకు పంపేందుకు పోలీసులను ఉసిగొల్పినప్పటికీ, నాటి సిఎం వైఎస్ఆర్ ఎంతో హుందాగా విజయగౌరిని వేదికపై రప్పించడంతోపాటు బదిలీలు రద్దు చేస్తున్నట్టుగా ప్రకటించారు.

హెచ్‌ఎం కుర్చీలో కూర్చుని మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావెంకటరావు(ఫైల్)

ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన టిడిపి నాయకులపై చర్యలు తీసుకోవాలి

ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.శ్రీనివాస

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా అధికార టిడిపి విచ్చలవిడిగా అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తోందని, వెంటనే ఆ పార్టీ నాయకులపై చర్యలు తీసుకోవాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.శ్రీనివాస.. ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. టిడిపి నాయకుల ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించిన చిత్రాలను ఆయన విడుదల చేశారు. చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు ఒక హైస్కూల్‌కు వెళ్లి, ఏకంగా ప్రధానోపాధ్యాయుల కుర్చీలో కూర్చుని టిడిపి బలపరిచిన అభ్యర్థికి ఓటు వేయాలని అక్కడి ఉపాధ్యాయులకు చెప్పడం ఎన్నికల కోడ్ ఉల్లంఘించరనడానికి ప్రత్యక్ష ఉదాహరణని పేర్కొన్నారు. అధికారులు దీనిపై ఏమాత్రమూ చర్యలు తీసుకోవడం లేదని ఆక్షేపించారు. అధికారులు అలసత్వంతో ఉంటే పోలింగ్ సమీపిస్తున్న కొద్దీ ఇటువంటి ఉల్లంఘనలు పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ విషయాన్ని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి ఎన్నికల ఏజెంట్ లేఖ రాసి ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని ఎన్నికల కోడ్ సక్రమంగా అమలయ్యేలా చూడాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సమాయత్తం

ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ఈనెల 27న జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలకు సమాయాత్తం కావాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పిఒ, ఎపిఒ, ఒపిఒ, ఎంఒలకు పిలుపు నిచ్చారు. ఎంఎల్సీ ఎన్నికల నిర్వహణపై సంబంధిత అధికారులతో కలెక్టర్ ఆదివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఎమ్మెల్సీ పోలింగ్ జరగనుందన్నారు. ఈ ఎన్నికలకు 2,333 మంది ఉపాధ్యాయ ఓటర్లు నమోదుకాగా, అందులో పురుషులు 1,574 మంది, మహిళలు 759 మంది ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. అత్యధికంగా పార్వతీపురంలో 636, పాలకొండలో 301, సాలూరులో 250 మంది ఓటర్లు ఉండగా, అత్యల్పంగా పాచిపెంటలో 34 మంది ఓటర్లు ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 15 మండలాల్లో జరిగే ఈ ఎన్నికల కొరకు ఇప్పటికే (20 శాతం రిజర్వుతో కలిపి) 18 మంది ప్రిసైడింగ్ అధికారులు (పీఒలు), 18 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు (ఎపిఒలు), 36 మంది ఇతర పోలింగ్ అధికారులు (ఒపిఒలు), 18 మంది సూక్ష్మ పరిశీలకులను (ఎంఒలు) నియమించినట్లు చెప్పారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు జిల్లాలో లేనందున, ఎన్నికల సంఘం జారీచేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను సజావుగా నిర్వహించాలని కలెక్టర్ హితవు పలికారు. ఎన్నికల నిర్వహణపై ఈనెల 18న తేదీన పిఒలు, ఎపిఒలకు తొలి విడత శిక్షణను ఇచ్చామని, రెండో విడత శిక్షణ సోమవారం ఉంటుందని కలెక్టర్ వివరించారు. కొత్తగా ఎన్నికల విధుల్లో చేరిన వారు పూర్తిగా అవగాహన చేసుకొని, సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. చిన్నపాటి పొరపాటుకు కూడా తావివ్వరాదని, ముఖ్యంగా ఎన్నికల ప్రక్రియలో పిఒలు కీలక పాత్ర వహించాల్సి ఉంటుందని అన్నారు. ఎన్నికల సామాగ్రి స్వీకరించినప్పటి నుంచి బ్యాలెట్ బాక్సులు అప్పగించేంత వరకు పూర్తి బాధ్యత వహించాలని తెలిపారు. పోలింగ్ ముందురోజున స్థానిక కలెక్టరేట్‌లోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద పోలింగ్ మెటీరియల్ పంపిణీ ఉంటుందని, చెక్ లిస్ట్ మేరకు వాటిని పరిశీలించుకోవాల్సిన బాధ్యత పిఒలపై ఉందని అన్నారు. పోలింగ్ నిర్వహణకు జిల్లాను ఆరు జోన్లుగా విభజించామని, అవసరం మేరకు బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. పిఒలకు కేటాయించిన పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్ తో ఇతర ఏర్పాట్లను ముందుగా పరిశీలించుకోవాలని, ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. పోలింగ్ కేంద్రంలోకి సెల్ ఫోన్లు తీసుకువెళ్లేందుకు అనుమతి లేనందున సెల్ ఫోన్ డిపాజిట్ సెంటర్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు పోలింగ్ అధికారులు, సూక్ష్మ పరిశీలకులు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సిపిఎస్ రద్దుకు మిలిటెంట్ పోరాటం

- ఉద్యోగ, ఉపాధ్యాయుల గొంతునవుతా
- పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రభుత్వ ఉద్యోగుల సిపిఎస్ రద్దు కోసం మిలిటెంట్ పోరాటం చేయాల్సిన అవసరం ఉందని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి చెప్పారు.ఆదివారం సాయంత్రం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినప్పుడల్లా విద్యారంగంలో రకరకాల సంస్కరణలు అమలు చేస్తున్న పరిస్థితి కనిపిస్తోందని చెప్పారు.గత ప్రభుత్వం జీవో 117 అమలు చేయడం వల్ల ప్రమాదకరమైన పరిస్థితికి దారి తీసిందన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జీవో నెంబర్ 117ను రద్దు చేసినట్లు చెపుతున్నప్పటికీ విద్యావ్యవస్థకు ప్రమాదం పొంచి వుందన్నారు. గత ప్రభుత్వం హయాంలో ఉన్నత పాఠశాలల్లో రెండు మాధ్యమాలను అమలు చేస్తే ఇప్పుడున్న ప్రభుత్వం ఒకే మాధ్యమాన్ని అమలు చేస్తామని చెపుతోందని అన్నారు. ఈ విధానం వల్ల ఉపాధ్యాయుల సంఖ్య తగ్గిపోతుందని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోతుందని చెప్పారు. ఈ విధానం రద్దు కోసం పోరాడుతానని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం పిఆర్సీ, డిఎ బకాయిల చెల్లింపుల ఊసే ఎత్తడం లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు రూ.25వేల కోట్ల బకాయిలు వున్నాయని చెప్పారు. అధికారంలోకి వస్తే ఆరు నెలల్లో పిఆర్సీ కమిటీ ఏర్పాటు చేస్తామని చెప్పిన టిడిపి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రభుత్వానికి వస్తున్న ఆదాయం ఉద్యోగుల జీతభత్యాలకే సరిపోతున్నదని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు చెప్పడం ప్రభుత్వ వైఖరికి అద్దం పడుతోందని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగుల సిపిఎస్ రద్దు కోసం, ఒపిఎస్ పునరుద్ధరణ కోసం మిలిటెంట్ తరహా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు గుదిబండ గా మారిన యాప్‌ల వ్యవస్థ రద్దు కోసం కృషి చేస్తానని చెప్పారు. విద్యారంగంలో ఉన్న పది యాజమాన్యాల కింద పని చేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. వారి గొంతు నై విధానమండలిలో పోరాడుతానన్నారు. కెజిబివిల్లో ఉపాధ్యాయులు వెట్టిచాకిరి చేస్తున్నారని, వీరికి మినిమం టైం స్కేల్ కోసం పోరాడుతానని చెప్పారు. మోడల్ స్కూళ్ళలో ఉపాధ్యాయులకు ఎడ్యుకేషనల్ సర్వీస్ రూల్స్ వర్తింపజేయాలన్నారు. ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో, ఐటిఐల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు జీవో 114 అమలు కోసం కృషి చేస్తానని చెప్పారు. ప్రయివేటు విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులకు సంక్షేమ నిధి ఏర్పాటు, ఆరోగ్య బీమా, గుర్తింపు కార్డుల మంజూరు కోసం పోరాడుతానని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతానికి గుండెకాయ లాంటి జీవో 3 పునరుద్ధరణ కోసం పోరాడుతానన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి కృషి చేస్తామని చెప్పారు. ఉత్తరాంధ్ర ఓటర్ల ఔన్నత్యాన్ని పెద్దల సభలో నిలబెట్టేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. ఒకప్పుడు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కు రాజకీయ పార్టీలతో సంబంధం వుండేది కాదని, అయితే ఇటీవల ఈ ఎన్నికలకు రాజకీయ రంగు పులుముతున్నారని అన్నారు. ఉపాధ్యాయ సమస్యలపై సుదీర్ఘ కాలం పోరాడిన అనుభవంతో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, ఉపాధ్యాయులు, అధ్యాపకులు తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని విజయగౌరి కోరారు.

విలేకరుల సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్ రావు, అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు టి.రమేష్, కె.బాస్కర రావు, జెవివి జిల్లా అధ్యక్షులు కె.గౌరునాయుడు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్, యుటిఎఫ్ జిల్లా కోశాధికారి కె.మురళి, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పిడి రాయుడు పాల్గొన్నారు.

జిఒ 3పై అసెంబ్లీలో ప్రస్తావించాలి

మంత్రికి ఆదివాసీ గిరిజన సంఘం వినతి

ప్రజాశక్తి - సాలూరురూరల్

గిరిజన ప్రాంతాల్లో 100 శాతం ఉద్యోగ నియామకాలకు సంబంధించిన జిఒ 3 పునరుద్ధరణపైనా, గిరిజనులకు ప్రత్యేక డీఎస్సీ కోసం సోమవారం నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్యేకంగా ప్రకటన చేయించేలా కృషి చేయాలనికోరుతూ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి ఆదివాసీ గిరిజన సంఘం ఆదివారం వినతిని అందజేసింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు సీదరపు అప్పారావు మాట్లాడుతూ షెడ్యూల్ ఏరియాలో ఉద్యోగ, ఉపాధ్యాయ నియమకాలు 100శాతం గిరిజన యువతతో నియామకాలు చేపట్టాలని, ఏజెన్సీ స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేసేందుకు అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావన చేసి ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని మంత్రిని కోరారు. అన్ని గిరిజన గ్రామాలకు రోడ్లు, వంతెనలు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. మంచినీటి సమస్య లేకుండా చేయాల న్నారు. జిసిసికి ప్రత్యేక నిధులు కేటాయించి అటవీ ఉత్పత్తులైన చింతపండు, జీడి, కొండచీపుర్లు అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర ప్రకటించి జిసిసి ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మెజారిటీ గిరిజన గ్రామాలను షెడ్యూల్ గ్రామాలుగా గుర్తించి ప్రకటించాలని కోరారు. సాలూరు పట్టణంలో గిరిజన భవనం నిర్మించాలని, సర్వే చేసిన వారందరికీ అటవీ పట్టాలు పంపిణీ చేయాలని, గెడ్డలు, నదులపై మినీ రిజర్వాయర్లు, చెక్ డాములు నిర్మించి సాగునీరందించాలని, దుగ్గేరు, నంద, కురుకూటి, వేటగానివలసలో పిహెచ్‌సిలు ఏర్పాటు చేయాలని కోరారు. పై సమస్యలన్నీ అసెంబ్లీలో ప్రస్తావించి పరిష్కారం దిశగా కృషి చేయాలని మంత్రిని కోరారు. కార్యక్రమం లో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు మంచాల శ్రీను, మండల అధ్యక్ష కార్యదర్శులు వంతల సుందర్రావు, గెమ్మే జానకీరావు, కమిటీ సభ్యులు బాబయ్య, మెల్లిక అయోధ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, మండల కార్యదర్శి తాడింగి గాసి పాల్గొన్నారు.

మంత్రి సంధ్యారాణికి వినతిని అందజేస్తున్న గిరిజనసంఘం నాయకులు

నూరుశాతం ఉత్తీర్ణతకు కార్యాచరణ

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

'ప్రజాశక్తి'తో గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.కృష్ణవేణి ముఖాముఖి

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో, గురుకుల పాఠశాలల్లో పదోతరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధనకు కార్యాచరణ రూపకల్పన చేసినట్లు గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.కృష్ణవేణి చెప్పారు. పార్వతీపురం ఐటిడిఎ పరిధిలోని అన్ని గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో పదోతరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులను సిద్ధం చేస్తున్న తీరుతెన్నుల గురించి ఆమె 'ప్రజాశక్తి'తో ముఖాముఖి మాట్లాడారు.

ప్రజాశక్తి - పార్వతీపురం





◆ **ఐటిడిఎ పరిధిలో ఎన్ని ఉన్నత పాఠశాలలున్నాయి? ఎంతమంది విద్యార్థులు పదోతరగతి రాస్తున్నారు?**

ఐటిడిఎ పరిధిలో 40 గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలున్నాయి. 1518 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాయబోతున్నారు. ఆరు గురుకుల పాఠశాలల్లో 415 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలకు హాజరవుతున్నారు. నాలుగు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లలో పదోతరగతి విద్యార్థులకు ఇప్పుడు పరీక్షలు జరుగుతున్నాయి. 211 మంది పదోతరగతి, 115మంది ఇంటర్మీడియట్ పరీక్షలు రాస్తున్నారు. మార్చి 17 నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

◆ **సిలబస్ పూర్తయిందా? పరీక్షలకు విద్యార్థులను ఎలా సిద్ధం చేస్తున్నారు?**

పదోతరగతి విద్యార్థులకు సంబంధించి సిలబస్ పూర్తయింది. సబ్జక్టుల వారీగా రివిజన్ జరుగుతోంది. ప్రీ ఫైనల్ పరీక్షలను నిర్వహిస్తున్నాం. ఈ పరీక్షల్లో ఫలితాలను బట్టి విద్యార్థులను ఎ,బి, సి, డి గ్రేడ్‌లుగా విభజించాం. సి,డి గ్రూపు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. పరీక్షలంటే భయం, ఆందోళన లేకుండా అవగాహన కల్పిస్తున్నాం.

◆ **రాత్రి పూట తరగతులు నిర్వహిస్తున్నారా? తనిఖీలు చేస్తున్నారా?**

పదోతరగతి విద్యార్థులకు రాత్రి పూట తరగతులు నిర్వహిస్తున్నాం. దీనిపై పాఠశాలలకు వెళ్లి ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నాం. సహాయ గిరిజన సంక్షేమ అధికారులు, డిడిగా నేను కూడా పాఠశాలలను ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నాం.

◆ **పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల ఆరోగ్యంపై ఎలాంటి శ్రద్ధ వహిస్తున్నారు?**

పదోతరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థు ఆరోగ్య పరిరక్షణలో భాగంగా రక్తహీనత ఎక్కువగా వున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. ఐరన్ మాత్రలు, శనగ పప్పు చక్కీలు, మిల్లెట్ చిక్కీలు పంపిణీ చేస్తున్నాం.

◆ **గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంలను ఎప్పుడు నియమిస్తారు?**

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంల నియామకం ప్రభుత్వం పరిశీలనలో ఉంది. ఆర్థికపరమైన అనుమతి మంజూరు కాకపోవడంతో జాప్యం అవుతోంది. వచ్చే విద్యా సంవత్సరానికి ఎఎన్ఎంల నియామకం జరిగే అవకాశం ఉంది.

పరీక్షలను పర్యవేక్షిస్తున్న జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్ష

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో 12 కేంద్రాల్లో జరిగిన గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా యంత్రాంగం పరీక్షల కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా జరిగింది. 12 కేంద్రాల్లో 84.69 శాతం మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్ జెఎన్‌టియు, సీతం కేంద్రాలను తనిఖీ చేసి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. డిఆర్ఒ శ్రీనివాసమూర్తి పరీక్షల నిర్వహణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించి పరీక్ష కేంద్రాల లోపలికి అనుమతించారు. సమయానికి ముందుగానే అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్దకు పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు పర్యవేక్షణ చేపట్టారు.

ప్రారంభానికి సిద్ధంగా ఎంఎల్ఎస్ గోడౌన్

ప్రజాశక్తి- వీరఘట్టం

మండలంలోని ఎస్.నర్సిపురంలో ఎంఎల్ఎస్ గోడౌన్ పాయింటు ప్రారంభానికి సిద్ధంగా ఉంది. వీరఘట్టం వ్యవసాయ పరపతి సేవా సంఘం ద్వారా రూ.40 లక్షల అంచనా వ్యయంతో నిర్మాణ పనులు చేపట్టారు. రైతులు పండించే పంటకు గిట్టుబాటు ధర వచ్చేంత వరకు గోడౌన్‌లో నిల్వ చేసుకోవచ్చునని, రైతులకు అతి తక్కువ ధరకు అద్దెకు ఇవ్వబడునని స్థానిక వ్యవసాయ పరపతి సేవా సంఘం సిఇఒ బి.పైడిరాజు తెలిపారు.

ప్రచారం చేస్తున్న యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ, ప్రజాసంఘాల నాయకులు

పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరికి మద్దతుగా ప్రచారం

ప్రజాశక్తి - కురుపాం

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కె.విజయగౌరికి మద్దతుగా ఆదివారం కురుపాంలోని అక్షర పబ్లిక్ స్కూల్, శోభలత దేవి కాలనీ, మంతినివలస కాలనీ, న్యూ కాలనీ, శివన్నపేట తదితర వీధుల్లో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు టి.రమేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్ ఉపాధ్యాయుల ఇంటింటికి వెళ్లి విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయాలతో సంబంధం లేకుండా నిష్పక్షపాతంగా ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ గొంతును శాసనమండలిలో వినిపించే విజయగౌరికి మొదట ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నామన్నారు.

వీరఘట్టం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరికి మీ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని యుటిఎఫ్ శ్రేణులు వీరఘట్టంలో ఉపాధ్యాయ ఓటర్లను విన్నవించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, మండల కార్యదర్శి కె గోవిందరావు, ఎస్.గణేష్, తదితరులు ఉన్నారు.

పలు కుటుంబాలకు మాజీ డిప్యూటీ సిఎం పరామర్శ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కురుపాం నియోజక వర్గంలోని కొమరాడ, జియ్యమ్మ వలస మండలాలకు చెందిన వైసిపి నాయకులు మృతి చెందిన సందర్భంగా వారి కుటుంబాలను మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీ వాణి ఆదివారం పరామర్శించారు. కొమరాడ మండలం శివిని గ్రామానికి చెందిన అధికారి కృష్ణం నాయుడు కుటుంబ సభ్యులకు, జియ్యమ్మ వలస మండలం రావాడకు చెందిన భీమారావు, పెదమేరంగికి చెందిన అధికారి నాగభూషణం ,జియ్యమ్మవలసకు చెందిన లాయర్ లచ్చిరెడ్డి గురు ప్రసాద్ కుటుంబాలను పరామర్శించి వారికి ధైర్యాన్ని చెప్పారు. కార్యక్రమంలో మండల వైసిపి కన్వీనర్ కోట రమేష్, ఆర్నిపల్లి వెంకట్ నాయుడు, మరడాన కిషోర్, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, మండల వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వెంకటాపురం సమీపాన సంచరిస్తున్న ఏనుగుల గుంపు

వెంకటాపురం సమీపాన ఏనుగుల సంచారం

ప్రజాశక్తి - కురుపాం

జియ్యమ్మవలస మండలంలో గల వెంకటాపురం గ్రామ సమీప ప్రాంతంలో ఏనుగుల గుంపు ఆదివారం సంచరిస్తూ పంటలను నాశనం చేశాయి. దీంతో రైతులు పంట పొలాల వద్దకు వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా గరుగుబిల్లి మండలంలో సంచరించిన ఏనుగుల గుంపు మళ్లీ జియ్యమ్మవలస మండలంలోకి అడుగుపెట్టాయని, వీటిని పూర్తిగా గ్రామాలకు రాకుండా దూరంగా అటవీ ప్రాంతానికి తరలించి తమ పంటలను ప్రాణాలకు రక్షణ కల్పించేలా అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇప్పటి వరకు నాశనం చేసిన పంటలను అంచనా వేసి నష్టపరిహారం ఇప్పించాలని రైతులు కోరుతున్నారు.

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ నారాయణరావు

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

ప్రజాశక్తి - కురుపాం

క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యానికి ఎంతగానో దోహదపడతాయని ఎస్సై పి.నారాయణరావు అన్నారు. మండలంలోని గుమ్మడిగూడ పంచాయితీ సింగుపురంలో జాకరమ్మ తల్లి యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న మెగా క్రికెట్ టోర్నీని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యువత చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించి క్రీడా నైపుణ్యాలు సాధించాలన్నారు. అలాంటప్పుడే మానసిక ప్రశాంతత, శారీరక దాడుఢ్యానికి దోహదపడతాయని అన్నారు. కావున ఈ మెగా క్రికెట్ టోర్నీలో యువత ఎక్కువ మంది పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువత పాల్గొన్నారు.

కొట్టుగుమ్మడ శ్మశానానికి వేసిన సిసి రోడ్డు

ఎట్టకేలకు శ్మశాన వాటికకు రహదారి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కొట్టుగుమ్మడలో శ్మశాన వాటికకు ఎట్టకేలకు సిసి రహదారి నిర్మాణ పనులు జరిగాయి. చిన్నపాటి చినుకు పడినా రోడ్డంతా చిత్తడి చిత్తడిగా బురదలోనే మృతదేహాన్ని శ్మశాన వాకిటకు తరలించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం పల్లె పండుగ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా రూ. 15 లక్షల అంచనా వ్యయంతో ఉపాధి హామీ పథకం ద్వారా సిసి రహదారి నిర్మించడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా రహదారి సౌకర్యం లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని, నేడు ఆ పరిస్థితి లేదని, గ్రామస్తులు చెబుతున్నారు.

బోరుబావులకు మరమ్మతులు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

బోరును బాగుచేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి

మండలంలోని ఉల్లిభద్ర దళితవాడలో, అలాగే హెల్త్ సెంటర్ వద్ద గల బోరు బావులను మరమ్మతులు చేసినట్టు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. క్రాస్ ప్రోగ్రాం ప్రారంభం కాక ముందే ఈ మరమ్మతులు చేపట్టామ న్నారు. రానున్న వేసవిలో తాగునీటికి ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఈ పనులు చేపట్టినట్టు తెలిపారు.

గర్భిణులకు ఎంబ్రాయిడరీలో శిక్షణ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గర్భిణుల ఆరోగ్యం బాగుండాలని, పండంటి బిడ్డకు జన్మఇవ్వాలని జిల్లాలో గర్భిణుల వసతి గృహాలను ఏర్పాటు చేసిన సంగతి విధితమే. ఈ వసతి గృహాల్లో గర్భిణులకు పౌష్టిక ఆహారం, వైద్య సేవలందిస్తున్నారు. ప్రసవానికి ముందే వసతి గృహాల్లో చేర్చడం వల్ల వారి ఆరోగ్యాన్ని పరిరక్షించడంతో పాటు బిడ్డ ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతోంది. అయితే గర్భిణుల వసతి గృహాల్లో వారి మానసిక వికాసానికి దోహదం చేసే అంశాలు ఏర్పాటు చేయడంతో వారి శారీరక, మానసిక ఆరోగ్యం బాగుంటుందని జిల్లా యంత్రాంగం సంకల్పించింది. ఇందులో భాగంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధ్వర్యంలో సంకల్ప పథకంలో భాగంగా ఎంబ్రాయిడరీలో ఉచిత శిక్షణ ఇచ్చేందుకు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. ఆ మేరకు స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహిస్తున్న గర్భిణుల వసతి గృహంలో గర్భిణులకు ఎంబ్రాయిడరీ శిక్షణ ప్రారంభించారు. దీంతో గర్భిణీ స్త్రీలకు స్వయం ఉపాధి వైపు అడుగులు వేసేందుకు అవకాశం ఉంటుందని భావించారు. ఎంబ్రాయిడరీ ప్రస్తుతం ఆదరణ పొందుతున్నందున మహిళలకు అదనపు ఆదాయం సమకూర్చేలా అవకాశాలు పొందగలరు. ప్రసవం అనంతరం ఇంటి వద్ద పనులు చేసుకుంటూ, ఆర్థికాభివృద్ధి సాధనకు కార్యక్రమం ఉపయోగపడుతోంది. ఈ శిక్షణ రోజూ 3 గంటల పాటు ఇస్తారు. ఇప్పటి వరకు 30 మందికి ఎంబ్రాయిడరీ, అల్లికలు, బ్లౌజ్లు, చీరలకు డిజైన్లు నేర్పించారు. ఈ కార్యక్రమం మానసిక ఆరోగ్యం మెరుగుకు ఎంతగానో తోడ్పడుతుందని గర్భిణీలు పేర్కొన్నారు. శిక్షణతో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, ఇంటివద్ద పనులు చేసి అదనపు ఆదాయం పొందగలమని గర్భిణీలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

హాస్టల్‌లో ఎబ్రాయిడరీ నేర్చుకుంటున్న గిరిజన గర్భిణులు

ఉచిత శిక్షణతో మరింత మనోధైర్యం

వసతి గృహంలో ఖాళీ సమయంలో ఎంబ్రాయిడరీ, ట్రైనింగ్ ద్వారా మా వంటి గర్భిణీ మహిళలకు చీరలు, బ్లౌజ్‌లపై డిజైన్లు నేర్పుతున్నారు. గతంలో ఇలాంటి వాటికి డబ్బులు చెల్లించి నేర్చుకునే వాళ్లం. ఇప్పుడు ఉచిత శిక్షణ ఇవ్వడం వల్ల బయట పనులతో పాటు ఎంబ్రాయిడరీ పనులు చేసి మరింత ఆదాయం పొందగలనన్న మనోధైర్యం కలిగింది.

ఆరిక దివ్యభారతి, ఇరిడి,
గుమ్మలక్ష్మీపురం మండలం.

అదనపు ఆదాయం పొందేందుకు దోహదం

ప్రసవం అనంతరం ఇంటి దగ్గర ఉండే మాలాంటి వారికి అదనపు ఆదాయం పొందేందుకు ఉపయోగపడుతోంది. చేతి అల్లికలతో పాటు ఎంబ్రాయిడరీ వర్క్ డిజైన్లు నేర్పించడం మరింత ప్రయోజనంగా ఉంటుంది. అందుకు జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు.

పువ్వుల సుమిత్ర, నెల్లిక్కికువ,
గుమ్మలక్ష్మీపురం మండలం.

స్వచ్ఛ సుందర పార్వతీపురం లక్ష్యం : డిపిఒ

ప్రజాశక్తి - సీతానగరం/ పార్వతీపురంరూరల్

సీతానగరం : కాశీపేటలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న డిపిఒ కొండలరావు

స్వచ్ఛ సుందర పార్వతీపురం జిల్లాను ఆవిష్కరించడమే లక్ష్యమని జిల్లా పంచాయతీ అధికారి తమర్భ కొండలరావు తెలిపారు. ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని పార్వతీపురం మండలం వెంకంపేట, సీతానగరం మండలం లచ్చయ్యపేట, కాశీపేటలో ఆయన ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున జిల్లాలో చేపడుతున్నామన్నారు. జిల్లాలో గల 451 గ్రామపంచాయతీల్లో ఈ కార్యక్రమం సాగుతోందని చెప్పారు. శని, ఆదివారాలు అన్ని గ్రామపంచాయతీల్లోనూ ఇంటింటా చెత్త సేకరణ పూర్తి చేయడమే లక్ష్యంగా యంత్రాంగం పనిచేసిందన్నారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరిస్తున్నట్టు తెలిపారు. సేకరించిన పొడి చెత్తలో ప్లాస్టిక్, గాజు పరికరాలు వంటి వివిధ పరికరాలను మళ్లీ చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాల్లో వేరుచేసి ఆయా రంగాల్లో సేకరణ చేస్తున్న వారికి విక్రయించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. చెత్త నుండి సంపద తయారు చేసే కేంద్రాల్లో తడి చెత్త నుండి సేంద్రియ ఎరువులను తయారు చేసే ప్రక్రియకు పెద్ద ఎత్తున శ్రీకారం చుడుతున్నామని అన్నారు. ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమంలో భాగంగా గ్రీన్ అంబాసిడర్ల సేవలను, వారితో పాటు గ్రామ పంచాయతీ సిబ్బంది యావత్తు పాల్గొన్నట్టు తెలిపారు. ప్రతి వెయ్యి జనాభాకు ఒక గ్రీన్ అంబాసిడర్, ఒక ట్రైసైకిల్ ఇప్పటికే సమకూర్చారని, తద్వారా ఈ చెత్త సేకరణ కార్యక్రమం సాగుతోందని చెప్పారు. జిల్లాలో రెండు రోజుల్లో తడి చెత్త 8,500 కిలోలు, పొడి చెత్త 5,500 కిలోలు వరకు సేకరించినట్లు ఆయన తెలిపారు. జిల్లా పరిశుభ్రంగా ఉండేందుకు ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమం ఆవశ్యకత ఉందని డిపిఒ తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇందుకు సహకరించి పారిశుధ్య జిల్లాను ఏర్పాటు చేయడంలో తోడ్పాటు అందించాలని కోరారు. పంచాయతీరాజ్ సంచాలకులు ఈ విషయం పట్ల ప్రత్యేక చొరవ తీసుకొని పనిచేస్తున్నారని చెప్పారు. ఇంటింటా చెత్త సేకరణపై ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో సీతానగరం ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ, పంచాయతీ కార్యదర్శులు శ్రీలక్ష్మి, సంతోష్ కుమార్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : ఇళ్లలో ఉండే చెత్త, అలాగే వ్యర్థాలను పారవేయవద్దని, వీటిని చెత్త సంపద కేంద్రాలకు తరలించాలని ఇఒపిఆర్‌డి గోపాలరావు అన్నారు. మండలంలోని సంతోషపురంలో గ్రామస్తులకు చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. ఇంట్లో ఉండే చెత్తను, వ్యర్థాలను వీధుల్లోనూ, కాలువల్లోనూ పారావేయవద్దని ఇంటింటికి వచ్చే చెత్త సేకరణ సిబ్బందికి అందజేయాలని సూచించారు. పాలిథిన్, ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల వాతావరణం కలుషితం చెంది మానవ జీవనంపై ప్రభావం చూపితుందని అవగాహన కల్పించారు. అలాగే ప్రతి ఇంటి నుంచి వెలువడిన ప్లాస్టిక్ వ్యర్థాలు చెత్త నుంచి సంపద కేంద్రాలకు అందజేయడం, అలాగే తడిచెత్త సంపద కేంద్రాల వద్ద నిల్వ చేయడం వల్ల వ్యవసాయానికి ఉపయోగపడే వానపాములను సృష్టించుకోవచ్చునని తెలిపారు. అంతేకాకుండా పంచాయతీకి సంపద సృష్టించుకోవచ్చన్నారు. కార్యక్రమం సర్పంచ్ అంబటి రాంబాబు, పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మక్కువ :మండల కేంద్రం మేజర్ పంచాయితీ మక్కువలో ఎంపిడిఒ డిడి స్వరూప రాణి, ఇఒపిఆర్‌డి దేవకుమార్ ఆదేశాల మేరకు పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపడుతున్నట్లు పంచాయతీ ఇఒ కె.సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్తలను వేరు చేస్తూ స్థానిక ప్రజలకు కూడా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. గ్రామంలోని అన్ని వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగిస్తున్నట్టు తెలిపారు. అలాగే కాశీపట్నం పంచాయతీలో కూడా పారిశుధ్య పనులు చేపడుతున్నారు

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె బాటే

మంత్రికి స్పష్టం చేసిన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్

ప్రజాశక్తి - సాలూరు

మంత్రికి వినతిని అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

స్థానిక మున్సిపాల్టీలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుంటే నిరవధిక సమ్మెకు వెళ్లేదానికి సిద్ధపడతామని, దీనికి అధికారులు, ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు తెలిపారు. ఈ మేరకు యూనియన్ సాలూరు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రాముడు, శంకర్రావుతో కలిసి ప్రతినిధి బృందం రాష్ట్ర గిరిజనసంక్షేమశాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణికి వినతి పత్రాన్ని ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతనెల 20న మంత్రికి తమ సమస్యలను గ్రీవెన్స్ చేసినప్పటికీ, జనవరి జీతాలు నేటికీ కార్మికుల ఖాతాలకు జమ కాలేదని, ఫిబ్రవరి జీతం బడ్జెట్ లేదని తెలిపారు. సమస్యను కమిషనర్ కు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని, ఇదే పరిస్థితి కొనసాగితే మరిన్ని ఇబ్బందులు కార్మికులు ఎదుర్కొంటారని, అప్పుడు కార్మికులు రోడ్లమీదకి వచ్చే ఆందోళన చేయాల్సి పరిస్థితి వస్తుందని, దీనికి అధికారులు, ప్రభుత్వమే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. అలాగే మంత్రి తన సొంత నిధులతో సబ్బులు, నూనెలు, చెప్పులు ఇస్తామని హామీ ఇచ్చినా, నేటికీ ఆ హామీ అమలు కాలేదని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. చనిపోయిన కుటుంబాలకు ఉద్యోగాలు వేసే ఫైలు నేటికీ ముందుకు వెళ్లలేదని, గత ప్రభుత్వం కాలయాపన చేసింది, ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా ఆ దార్లోనే ఉందని తెలియజేశారు. రాష్ట్ర మంత్రివర్గం ఆప్కాస్‌ను రద్దు చేయాలన్నప్పుడు ఉన్న కాంట్రాక్ట్ కార్మికులందర్నీ పర్మినెంట్ చేయాలన్నారు. ఈ అంశంపై సోమవారం నుంచి జరిగే శాసనసభ సమావేశాల్లో చర్చించాలని కోరారు. అధికారులతో చర్చించి వీలైనంత తొందరగా సమస్యలు పరిష్కరిస్తామని ప్రతినిధి బృందానికి మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎం.శ్రీనివాసరావు, మున్సిపల్ యూనియన్ నాయకులు స్వప్న, రవి, శ్రీను పాల్గొన్నారు.

సూర్యపీఠంలో క్షీరాభిషేకం

పార్వతీపురం టౌన్ : పట్టణ శివారులో గల శ్రీ సూర్య పీఠంలో మాఘమాస ప్రయుక్త భానువాసర సందర్భంగా వేమకోటి నరహరి శాస్త్రి అధ్వర్యంలో సూర్య నమస్కారాలు, సౌర హెూమాలు, సుదర్శన హోమాలు, తదితర పూజలు ఆదివారం నిర్వహించారు. నవనాగ అర్చన నవగ్రహ హెూమాలు చేపట్టారు. కార్యక్రమంలో వేమకోటి వివేకానంద్, కేశవశర్మ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులతో మాట్లాడుతున్న జగన్మోహనరావు

గర్భిణుల హాస్టల్ సందర్శన

ప్రజాశక్తి -సాలూరు

గిరిశిఖర, మారుమూల గిరిజన ప్రాంతాల గర్భిణులను కాన్పు సమయానికి ముందస్తుగానే గర్భిణుల వసతి గృహాల్లో చేర్పించాలని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి.జగన్మోహనరావు, డాక్టర్ పిఎల్. రఘు పేర్కొన్నారు. స్థానిక వైటిసిలో గర్భిణుల వసతి గృహాన్ని ఆదివారం వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రస్తుతం చేరిన గర్భిణులు, వారి ఆరోగ్య స్థితి, ప్రతి నెలా పలు గిరిజన ప్రాంతాల నుంచి వసతి గృహంలో చేరుతున్న గర్భిణుల వివరాలు రికార్డులో తనిఖీ చేశారు. వారి పర్యవేక్షణపై సిబ్బందిని ఆరా తీశారు. నిర్ణీత సమయంలో గైనకాలజిస్ట్‌చే ఆరోగ్య తనిఖీలు చేయిస్తున్నారా, హైరిస్క్ సమస్యలతో ఎవరినైనా గుర్తించారా అని అడిగి తెలుసుకున్నారు. గర్భిణీలతో మాట్లాడి ఏ ప్రాంతాల నుంచి వచ్చారు, వారికి అందుతున్న వైద్య సేవలు, పోషకాహారం, ఇతర మౌలిక సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. మాతా, శిశు సంరక్షణ కార్డుల్లో వారి ఆరోగ్య పరీక్షల వివరాలు పరిశీలించారు. అక్కడ వసతి గృహ గర్భిణీ వాహనం పని తీరు అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది నిర్దేశించిన షిఫ్ట్‌ల వారీగా సమయపాలన పాటిస్తూ వసతి గృహంలో అందుబాటులో ఉండాలని, గర్భిణీలకు ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం నిర్మాణం పూర్తి దశలో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రం పని పురోగతిని వారు పర్యవేక్షణ చేశారు. ఈ కార్యక్రమంలో వైటిసి మేనేజర్ ఎన్.విద్యాసాగర్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి -భామిని

40 ఏళ్ల తర్వాత పదోతరగతి విద్యార్థులు కలయిక వారి స్నేహబంధం నేటి తరానికి ఆదర్శమని వక్తలు కొనియాడారు. మండలంలోని బత్తిలి హైస్కూలులో 1984-85లో పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో బత్తిలి ఎంపిటిసి సభ్యులు టింగ అన్నాజీరావు మాట్లాడుతూ ఎక్కడెక్కడ నుంచో పూర్వ విద్యార్థులు నాలుగుదశాబ్దాలు తర్వాత కలవడం గొప్పవిషయమన్నారు. తాను ఇదే పాఠశాల విద్యార్థినన్నారు. రిటైర్డ్ టీచర్ పాపారావు సైతం అప్పట్లో పాఠశాల పనితీరుపై ప్రశంసించారు. ఎస్సై అనిల్ కుమార్, సర్పంచ్ శాంతకుమారి తదితరులు పాల్గొని ప్రశంసించారు. అనంతరం పదోతరగతి విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. 40 ఏళ్ల తర్వాత మళ్లీ కలవడంతో వారి పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ మళ్లీ 15 ఏళ్ల పిల్లలుగా మారిపోయారు. ఒకరినొకరు ఆప్యాయతగా పలుకరించుకున్నారు. ఈ సందర్భంగా పలువుర్ని సత్కరించారు. ఆ బ్యాచ్‌కు సంబంధించి 12 మంది విద్యార్థులు, రిటైర్డు హెచ్ఎం వేణుగోపాలరావుతో పాటు మరణించిన ఉపాధ్యాయులను స్మరించుకుంటు శ్రద్ధాంజలి ఘటించారు.

జిల్లా అభివృద్ధికి రూ.10వేల కోట్లు కేటాయించాలి

పెదంకలాం కాలువ చివరి భూములకు సాగునీరందించాలి

ప్రజాశక్తి - బలిజిపేట

బలిజిపేటలో నిరసన ర్యాలీ చేస్తున్న గ్రామస్తులు

పార్వతీపురం మన్యం జిల్లా అభివృద్ధికి రూ.10వేల కోట్లు కేటాయించాలని సిపిఎం నాయకులు యమ్మల మన్మథరావు, బొద్దాన భానుమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు బలిజిపేటలో కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన్యం జిల్లా అభివృద్ధికి దూరంగా ఉందని, ఏ పార్టీ అధికారంలోకి వచ్చిన మాటలు చెప్పడం తప్ప అభివద్ధి జరగడంలేదని విమర్శించారు. మండలంలోని పెదఅంకలాం కాలువ 27 గ్రామాలకు 9వేల ఎకరాలకు సాగు, తాగు నీరిందస్తుందని, దీని అభివృద్ధికి జైకా నిధులు వచ్చినా కాలువ పనులు చేపట్టకపోవడతో చివరి భూములకు నీరు అందడంలేదన్నారు. అలాగే మండలంలోని అంపావలి ఎత్తిపోతల పథకం, తోటపల్లి కాలువ ద్వారా బరి, శివరాంపురం, సుభద్ర, అరసాడ, మిర్తి వలస, చెల్లింపేట, వెంగాపురం భూములకు సుమారు వెయ్యి ఎకరాలకు నీరు చేరుతుందని, అయితే భూసేకరణ జరిగినా ఇంతవరకు కాలువ పనులు ప్రారంభించలేదని అన్నారు. జిల్లాలో జంఝావతి ప్రాజెక్ట్ 50 క్రితం ప్రారంభించినా ఇంత వరకు పనులు పూర్తి కాలేదన్నారు. జిల్లాలో గుమ్మడి గెడ్డ, ఆడారు గెడ్డ, వనకాబడి గెడ్డ ల్లాంటి వాటిపై మినీ రిజర్వాయర్ల, చెక్‌డ్యామ్‌లు కడితే వేల ఎకరాల భూమి సాగులోకి వస్తుందన్నారు. అలాగే జిల్లాలో మెడికల్ కాలేజీ, యూనివర్శిటీ, పిజి కాలేజీలు, బలిజిపేటలో డిగ్రీ కాలేజీ, కురుపాం, పాలకొండ, సాలూరులో సూపర్ స్పెషాలిటీ హాస్పటళ్లు ఏర్పాటు చేయాలని డిమాండు చేశారు. కావున జిల్లా అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్‌లో రూ.10వేల కోట్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు త్రినాధ, భానుమూర్తి, వెంకటరమణ, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సిరిమాను చెట్టు ఊరేగింపు

ప్రజాశక్తి - సాలూరురూరల్

శ్యామలాంబ అమ్మవారి గ్రామ దేవత పండగ సందర్భంగా స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న సిరిమాను చెట్టును ఆదివారం పట్టణంలో ఘనంగా ఊరేగించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆధ్వర్యాన నిర్వహించిన తిరువీధి కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి జి.సంధ్యారాణి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త యువరాజు, ఉత్సవ కమిటీ అధ్యక్షులు అక్యాన అప్పారావు, కార్యదర్శి నిమ్మాది తిరుపతిరావు, సభ్యులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌కు వితరణ

ప్రజాశక్తి - సాలూరురూరల్

పోలీసు స్టేషన్‌కు ప్యూరిఫై అందజేస్తున్న క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ లిమిటెడ్ ప్రతినిధులు

సామాజిక బాధ్యతలో భాగంగా క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ లిమిటెడ్ కంపెనీ సాలూర్ బ్రాంచ్ స్థానిక పట్టణ పోలీసు స్టేషన్‌కు ప్రజల సౌలభ్యం కోసం వాటర్ ప్యూరిఫై కం డిస్పెన్సర్ 1, మూడు సీటర్స్ స్టీల్ సోపాలు రెండు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ లిమిటెడ్ కంపెనీ విశాఖపట్నం డివిజనల్ మేనేజర్ వెంకట రమణ మాట్లాడుతూ తమ బ్యాంకు ద్వారా సిఎజిఎల్ కంపెనీ కార్యక్రమాలు దేశంలో 18 రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నాయన్నారు. 231 బ్రాంచులున్నాయని, అన్ని బ్రాంచీల పరిధిలో సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో గల 62 బ్రాంచ్‌ల పరిధిలోని పోలీస్ స్టేషన్లు, ప్రభుత్వ ఆసుపత్రులకు, పాఠశాలలకు, అంగన్వాడీ సెంటర్లకు అవసరమైన వస్తువులను అందజేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులను పట్టణ సిఐ అప్పలనాయుడు అభినందించారు. కార్యక్రమంలో కంపెనీ లైజనింగ్ ఆఫీసర్ రమేష్ బాబు, ఏరియామేనేజర్ పి .చక్రధర్‌రావు, బ్రాంచ్ మేనేజర్ పి.గోపాల్, స్థానిక బ్రాంచ్ సిబ్బంది, సాలూర్ పిఎస్ ఎస్‌హెచ్ఒ, ఎస్ఐ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.